విలేకరులు కావలెను

పవర్ జాతీయ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను.

ఆసక్తి కలవారు, అనుభవం కలవారుసంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాలవారీగా విలేకరులు కావలెను

సీనియర్లకు ప్రాధాన్యత, కొత్తవారికి అవకాశం ఉంటుంది

ఇంచార్జ్ : పొన్నం మహేష్‌గౌడ్

90004 88885



Dr.PRK

# పవర్

పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప



రామకృష్ణ హాస్పిటల్స్

పక్షవాతం, డిస్క్ సమస్యలు, నడుమునొప్పి, మెడ నొప్పులకు పూర్తి చికిత్స కలదు.

నిరుపేదలకు ఉచిత వైద్యం

రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్

విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లైన్, హనుమకొండ

సెల్: 9849485100



సంపుటి : 01 సంచిక : 323 | ఆదివారం 23 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 4


# మెట్రో రెండో దశలో సరికొత్త హంగులు

ఓచోట 'డబుల్ డెక్', మరోచోట భూగర్భ మార్గం

మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశలో పలు ప్రత్యేకతలు, సవాళ్లు

హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మెట్రో మార్గం

మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్

మెట్రో రెండో దశలో హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మార్గం

హైదరాబాద్, పవర్ న్యూస్

మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ ప్రత్యేకతలు, సవాళ్లతో కూడుకున్నది. ఈ మార్గం సంక్లిష్టమైన రైల్వే క్రాసింగ్‌లు, ఫ్లైఓవర్లు, హైటెన్షన్ విద్యుత్ లైన్లు, విమానాశ్రయ ప్రాంగణాల గుండా వెళ్లాల్సి ఉంటుంది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట కారిడార్‌లో హకీంపేట విమానాశ్రయం రన్‌వే కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు హెచ్‌ఎండీఏ ప్రణాళిక చేసిన హైవే టన్నెల్ వెంబడి 1.65 కి.మీ మేర భూగర్భ మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. అదేవిధంగా నాగోల్ టూ శంషాబాద్ మార్గంలో విమానాశ్రయం సమీపంలో 1.6 కి.మీ భూగర్భ మెట్రో విభాగాన్ని ..మిగతా 2లో



## గచ్చిబౌలిలో కుప్పకూలిన
# ఏడంతస్తుల భవనం

ఇద్దరు మృతి..మరొకరికి తీవ్ర గాయాలు

హైదరాబాద్, పవర్ న్యూస్

గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. రమణారెడ్డి అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. అయితే, నాలాను ఆనుకుని 50 గజాల్లో అక్రమం గా ఈ భవనాన్ని నిర్మించారు. ఈ నిర్మాణం కూలిన పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై శకలాలు పడ్డాయి. భయంతో పక్కనే ఉన్న హాస్టల్లోకి విద్యార్థులు పరుగులు తీశారు. ఈ సంఘటన స్థలానికి హైడ్రా, డీఆర్‌ఎఫ్ టీమ్స్ చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనం నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో ఈ నిర్మాణానికి సీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో ..మిగతా 2లో



## తెలంగాణలో విద్యావ్యవస్థ పటిష్టతకు
# కేంబ్రిడ్జ్ సహకారం

యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం రేవంత్ చర్చలు

కేంబ్రిడ్జ్, లండన్ వర్సిటీలను సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

విద్య, పరిశోధనల్లో భాగస్వామ్యంపై చర్చ

లండన్ కేంబ్రిడ్జ్, లండన్ వర్సిటీలను సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం

విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో చర్చ

హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరిన సీఎం బృందం



లండన్, పవర్ న్యూస్

లండన్‌లోని ప్రఖ్యాత కేంబ్రిడ్జ్, లండన్ వర్సిటీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరారు. యువపారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించు కోవాలని ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్ర మానికి మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌లు హాజరయ్యారు. మరోవైపు సీఎం రేవంత్ పర్యటనకు కేంద్రం నో చెప్పడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక ..మిగతా 2లో

## హైదరాబాద్‌లో భారీ పన్ను ఎగవేత గుట్టురట్టు

హైదరాబాద్‌లో భారీ పన్ను ఎగవేత రాకెట్ బట్టబయలు

అక్రమ పాన్ మసాలా యూనిట్‌పై సీజీఎస్టీ అధికారుల దాడులు

సుమారు రూ. 160 కోట్ల మేర పన్ను ఎగవేసినట్లు నిర్ధారణ



# దానం నాగేందర్ అనర్హత పిటిషన్



తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

హైదరాబాద్, పవర్ న్యూస్

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం శనివారం వెల్లడించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ కూడా చేశారని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు

# నాలుగేళ్ల లోపు చిన్నారుల మందులపై కేంద్రం ఆంక్షలు

క్లోర్‌ఫెనిరమైన్, ఫినైల్‌ఫ్రైన్ ఉన్న ఎఫ్‌డీసీ మందులకు ఇది వర్తింపు

మందుల లేబుల్‌పై హెచ్చరిక తప్పనిసరిగా ముద్రించాలని ఆదేశం

నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం

ఈ మందుల తయారీ, అమ్మకాలు, పంపిణీపై పరిమితులు

న్యూఢిల్లీ, పవర్ న్యూస్

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగేళ్ల లోపు చిన్నారులకు క్లోర్‌ఫెనిరమైన్ మలేట్, ఫినైల్‌ఫ్రైన్ హైడ్రోక్లోరైడ్‌తో కూడిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) ఔషధాల వాడకంపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఈ ఔషధాల తయారీ, విక్రయాలు, పంపిణీని పరిమితం చేస్తూ ..మిగతా 2లో



# సీన్ రివర్స్! సీఎం అనుకున్నది కావడం లేదా..?
# సురేఖపై చర్యలకు జాతీయ నాయకత్వం బ్రేకులు



పవర్ -- వరంగల్-తెలంగాణ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదం అనూహ్య మలుపు తిరిగింది. కొండా సురేఖపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం వర్గం నుంచి వచ్చిన డిమాండ్లకు కాంగ్రెస్ జాతీయ నాయకత్వం బ్రేకులు వేసినట్లు తెలుస్తోంది. వ్యవహారం ఢిల్లీ పెద్దల దృష్టికి వెళ్లడంతో పరిస్థితిని చల్లబరిచే ప్రయత్నాలు మొదలయ్యాయా? అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.తొలుత సురేఖపై చర్యలు తప్పవన్న స్థాయిలో సాగిన చర్చ.. ఇప్పుడు అధిష్ఠానం జోక్యంతో వెనక్కి తగ్గినట్లు కనిపిస్తుండటం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. అంతేకాదు.. "సీఎం వచ్చాకే మాట్లాడుతా" అని కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ పరిణామాలకు సంకేతమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### చర్యలకు బ్రేకులెందుకు?

సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లో మొదట తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. సీఎల్పీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం, మహిళా నేతలు బహిరంగంగా స్పందించడంతో పార్టీ క్రమశిక్షణ కింద చర్యలు తప్పవన్న అభిప్రాయం బలపడింది. అయితే జాతీయ నాయకత్వం నుంచి వచ్చిన సూచనలతోనే రాష్ట్ర నాయకత్వం దూకుడును తగ్గించిందన్న ప్రచారం సాగుతోంది. సురేఖపై వెంటనే చర్యలు తీసుకుంటే బీసీ మహిళా మంత్రిపై పార్టీ వివక్ష చూపుతోందన్న భావన ఏర్పడే అవకాశం ఉందని అధిష్ఠానం ఆరా తీసినట్లు సమాచారం.

### కొండా కుటుంబానికి ఢిల్లీ అండా?

కొండా కుటుంబానికి ముఖ్యంగా సోనియాగాంధీతో ఉన్న పాత రాజకీయ అనుబంధం నేపథ్యంలో ఈ వివాదంలో జాతీయ నాయకత్వం జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఒక మంత్రి కుటుంబానికి సంబంధించిన వివాదాన్ని కేవలం క్రమశిక్షణ సమస్యగా చూడకుండా.. దాని వెనుక ఉన్న సామాజిక, రాజకీయ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఢిల్లీ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం.

### మల్లు రవి స్వరం మారిందా?

ఈ పరిణామాల మధ్య సీనియర్ నేత మల్లు రవి వైఖరితో పాటు, మొదట తీవ్రంగా స్పందించిన పలువురు నాయకుల స్వరాల్లోనూ మార్పు కనిపిస్తోంది. బీసీ మహిళా మంత్రి విషయంలో పలువురు నేతలు ఒకేసారి బహిరంగంగా మాట్లాడటం సరికాదన్న భావన అధిష్ఠానం వ్యక్తంచేయడం వల్లే నాయకులు తమ వ్యాఖ్యలను మృదువుగా మార్చుకున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### 'సీఎం వచ్చాకే మాట్లాడుతా'..

తన కుమార్తె వ్యాఖ్యలపై కొండా సురేఖ ఇప్పటివరకు ఘాటైన వివరణ ఇవ్వకుండా "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత మాట్లాడుతా" అని చెప్పడం వెనుక అంతరార్థంపై ఆసక్తి నెలకొంది. సీఎంతో నేరుగా మాట్లాడి సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నమా? లేక అధిష్ఠానం సూచనల మేరకు వేచి చూస్తున్నారా? అనేది సీఎం హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాతే స్పష్టత రానుంది.

### సీఎం కోటరీలో కలకలం!

ఒకవైపు సీఎంకు ఎమ్మెల్యేల బహిరంగ మద్దతు, మరోవైపు మంత్రుల మౌనం, ఇంకోవైపు అధిష్ఠానం జోక్యం వెరసి తెలంగాణ కాంగ్రెస్‌లో ఈ వ్యవహారం సాధారణ వివాదాన్ని దాటి నాయకత్వ సమీకరణాల పరీక్షగా మారింది. బీసీ కార్డ్ తెరపైకి రావడం, జాతీయ నాయకత్వం ఆచితూచి వ్యవహరిస్తుండటంతో ఈ పరిణామాలు ముఖ్యమంత్రి కోటరీలో తీవ్ర కలకలానికి దారితీశాయి.

**– ఇర్సడ్ల వంశీకృష్ణ, రిపోర్టర్, పవర్ దినపత్రిక.**

# తెలంగాణలో విద్యావ్యవస్థ పటిష్టతకు
# కేంబ్రిడ్జ్ సహకారం

**మొదటి పేజీ తరువాయి...**

వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లండన్‌లోని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆసక్తి చూపింది. భాగస్వామ్య ఒప్పందం చేసుకునేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్ రానుంది. లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇవాళ లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి : లండన్‌లోని ప్రఖ్యాత ఇంపీరియల్ కాలేజీని సీఎం సలహాదారు రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో రామకృష్ణారావు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను రామకృష్ణారావు ఆహ్వానించారు.

కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటోంది : సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన రేపటితో పూర్తవ్వనుంది. ఆయన అమెరికా పర్యటనకు కేంద్రం నో చెప్పడంతో లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. పెట్టుబడుల కోసం వెళ్లే పర్యాటనలను అడ్డుకోవడం ముమ్మాటికీ అన్యాయమేనని ఆయన అభిప్రాయపడ్డారు. బీజేపీ పెద్దలు తమకు కావాల్సిన వారికి అనుమతి ఇస్తారని, తెలంగాణ సీఎంకు మాత్రం విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు.



అమెరికాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, పెట్టుబడులు వస్తే తెలంగాణతో పాటు దేశానికి కూడా లాభమేనన్నారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పర్యటనలను అడ్డుకుంటోందని ఖర్గే ఆరోపించారు. ముఖ్యమంత్రులు వెళ్లి పెట్టుబడులు తెస్తారనే భయం వారిలో ఉందన్నారు. అన్నీ తమ ద్వారా జరగాలనేది కేంద్రం సంకుచిత ఆలోచన అని ఖర్గే విమర్శించారు.

లండన్ యూనివర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్ : హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు లండన్ యూనివర్సిటీ ప్రతినిధులు సీఎంకు తెలిపారు. లండన్ యూనివర్సిటీ ప్రతినిధులు అక్కడి సెనేట్ హౌస్‌లో సీఎం రేవంత్ రెడ్డి బృందంతో చర్చించింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ ప్రతినిధి బృందాలు కూడా పాల్గొన్నాయి. యూనివర్సిటీకి చెందిన వివిధ స్కూళ్లు, విభాగాల ద్వారా ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు అందించేలా హైదరాబాద్‌లో క్యాంపస్‌ను ఏర్పాటుకు యోచిస్తున్నట్టు యూనివర్సిటీ ప్రతినిధులు వివరించారు.

లండన్ యూనివర్సిటీకి చెందిన వివిధ విద్యా విభాగాలను ఒకే అకడమిక్ ఫెడరేషన్‌గా అనుసంధానించే విధంగా ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయని చెప్పారు. అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించినందున.. సీఎం రేవంత్‌రెడ్డి లండన్ పర్యటన ఇవాళ ముగించుకొని హైదరాబాద్ బయలుదేరనున్నారు. సీఎం సలహాదారు రామకృష్ణరావు, ప్రత్యేక సీఎస్ జయేష్ రంజన్ తదితరులు అమెరికా వెళ్లి హార్వర్డ్, ఎంఐటీ, నార్త్ ఈస్టర్న్, వర్జీనియా టెక్ వంటి ప్రముఖ యూనివర్సిటీలను సందర్శించి పలు ఎంవోయూలు చేసుకోనున్నారు.

# హైదరాబాద్‌లో భారీ పన్ను ఎగవేత గుట్టురట్టు

హైదరాబాద్, పవర్ న్యూస్

హైదరాబాద్‌లో భారీ జీఎస్టీ ఎగవేత గుట్టును హైదరాబాద్ సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ) అధికారులు రట్టు చేశారు. నగర శివార్లలోని ఒక రేకుల షెడ్డులో రహస్యంగా నిర్వహిస్తున్న పాన్ మసాలా, పొగాకు తయారీ యూనిట్‌పై దాడి చేసి, సుమారు రూ. 160 కోట్ల మేర పన్ను ఎగవేతను గుర్తించారు. ఈ అక్రమ దందాను నిర్వహిస్తున్న కీలక వ్యక్తిని అధికారులు అరెస్ట్ చేశారు.అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ యూనిట్‌లో ఎటువంటి అనుమతులు లేకుండానే పాన్ మసాలా, సుగంధ జర్దా వంటి ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. తనిఖీల సమయంలో లెక్కల్లో చూపని 40 ప్యాకింగ్ యంత్రాలను అధికారులు కనుగొన్నారు. ఈ ఫ్యాక్టరీలో మొత్తం 56 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇక్కడ తయారైన సరుకును జీఎస్టీ, హెచ్‌ఎస్‌ఎన్‌ఎస్ సెస్, సెంట్రల్ ఎక్సైజ్ సుంకాలు చెల్లించకుండానే మార్కెట్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది.దాడుల్లో భాగంగా రవాణాకు సిద్ధంగా ఉన్న రూ. 76 లక్షల విలువైన సరుకుతో పాటు, 5,500 కిలోల రెడీమేడ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 2,015 కిలోల పాన్ మసాలా మిశ్రమం, 810 కిలోల పొగాకు, ప్యాకింగ్ మెటీరియల్‌తో పాటు అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేశారు.పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులపై 2026 ఫిబ్రవరి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త పన్ను నిబంధనల నుంచి తప్పించుకోవడానికే ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. పట్టుబడిన స్టాక్, యంత్రాల సామర్థ్యం, పనిచేస్తున్న కార్మికుల సంఖ్య ఆధారంగా మొత్తం పన్ను ఎగవేత రూ. 160 కోట్లుగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ రాకెట్‌లో ప్రధాన సూత్రధారిని అరెస్ట్ చేయగా, ప్రత్యేక ఆర్థిక నేరాల కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.




# నాలుగేళ్ల లోపు చిన్నారుల మందులపై
# కేంద్రం ఆంక్షలు

**మొదటి పేజీ తరువాయి...**

నోటిఫికేషన్ విడుదల చేసింది. సాధారణంగా జలుబు, దగ్గు, అలర్జీ వంటి సమస్యల నివారణకు వాడే ఔషధాలలో ఈ కాంబినేషన్‌ను వినియోగిస్తారు. ఇకపై ఈ మందుల లేబుల్స్, ప్యాకేజీలపై "ఈ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌ను నాలుగేళ్ల లోపు పిల్లలకు ఇవ్వరాదు" అనే హెచ్చరికను తప్పనిసరిగా ముద్రించాలని ఔషధ తయారీ సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. నిపుణుల కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) చేసిన సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. గతంలో 2025 ఏప్రిల్ 15న ఈ సమ్మేళనాలు కలిగిన కొన్ని ఎఫ్‌డీసీ మందులపై మాత్రమే ప్రభుత్వం ఇలాంటి ఆంక్షలు విధించగా, తాజా ఉత్తర్వుల ద్వారా ఈ నిబంధనను అన్ని రకాల ఫార్ములేషన్లకు వర్తింపజేసింది. నాలుగేళ్ల లోపు చిన్నారులపై ఈ మందులు ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని, వీటికి బదులుగా సురక్షితమైన ప్రత్యామ్నాయ ఔషధాలు అందుబాటులో ఉన్నాయని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940లోని సెక్షన్ 26ఏ కింద కేంద్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.



# మెట్రో రెండో దశలో సరికొత్త హంగులు

ప్రతిపాదించారు. మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్‌లో ఫ్లైఓవర్, రెండో ఎలివేటెడ్ మెట్రో వెళ్లేలా డిజైన్ చేశారు.

శంషాబాద్ విమానాశ్రయానికి సంబంధించి కార్గో విమానాశ్రయ స్టేషన్లతో పాటు విమానాశ్రయ ప్రాంగణంలోనే మెట్రో డిపో ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయి. దీనికి ఆమోదం తెలపాలని మెట్రో అధికారులు పౌర విమానయాన శాఖను కోరారు. బేగంపేట విమానాశ్రయ రన్‌వే చుట్టూ ఉన్న 'ఫన్నెల్ జోన్'లో ఎత్తుకు సంబంధించిన పరిమితులు ఉన్నాయి. అందువల్ల శామీర్‌పేట, మేడ్చల్ మెట్రో కారిడార్లను తక్కువ ఎత్తులో నిర్మించేలా ప్రణాళిక చేశారు. ఈ మార్గాలకు అనుమతి కావాలని కోరారు.

రైల్వే క్రాసింగ్‌లు : మెట్రో మార్గం ఫలక్‌నుమా, ఆరాంఘర్, శంషాబాద్, గుండ్లపోచంపల్లి, లోతుకుంట, అల్వాల్ వద్ద రైల్వే ట్రాక్‌లను దాటాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి దక్షిణ మధ్య రైల్వే నుంచి ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం లభించింది. అయితే సుచిత్ర ప్రాంతానికి సంబంధించిన అనుమతి ఇంకా పెండింగ్‌లో ఉంది.

జాతీయ రహదారి మార్గాలు : చీఎ-65 (మదీనాగూడ నుంచి పటాన్‌చెరు వరకు, చింతలకుంట నుంచి హయత్ నగర్ వరకు) చీఎ-44 (ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు, బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు) వెంబడి మెట్రో పిల్లర్ల నిర్మాణానికి సంబంధిత అధికారులు 'రైట్ ఆఫ్ వే' అనుమతులను మంజూరు చేయాల్సి ఉంది.

కేంద్రం వాటా : రూ.6,666 కోట్లు (17%)

రాష్ట్రం వాటా : రూ.11,933 కోట్లు (31%)

రుణాలు : రూ.19,996 కోట్లు (52%)

వివిధ కార్పొరేషన్ల పరిధిలో విస్తరణ : ప్రతిపాదిత రెండో దశ మార్గం జీహెచ్ఎంసీ పరిధిలో 36.5 కి.మీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 24.9 కి.మీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 41.3 కి.మీ మేర విస్తరించి ఉంది. ఇంకా 'రైట్ ఆఫ్ వే' అనుమతులను వేగవంతం చేయాలని మెట్రో రైలు అధికారులు హెచ్ఎండీఏ కంటోన్మెంట్ బోర్డును కోరారు.

ప్రతిపాదన వివరాలు :

కారిడార్లు: 7

దూరం: 122.9 కి.మీ

స్టేషన్లు: 86

ప్రాజెక్ట్ వ్యయం: రూ.38,595 కోట్లు

ప్రయాణికులు: 12.42 లక్షలు



# దానం నాగేందర్ అనర్హత పిటిషన్

**మొదటి పేజీ తరువాయి...**

కోర్టుకు వివరించారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్ కొట్టివేశాడని వెల్లడించారు. తాను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఇరు వర్గాల వాదనలు విని తుది తీర్పును రిజర్వ్ చేస్తూ, సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

## గచ్చిబౌలిలో కుప్పకూలిన
# ఏడంతస్తుల భవనం

**మొదటి పేజీ తరువాయి...**

టౌన్ ప్లానింగ్ అధికారులకు ముడుపులిచ్చి ఈ భవనాన్ని యజమాని నిర్మిస్తున్నట్లు సమాచారం. క్రమంగా బిల్డింగ్ నిర్మాణాన్ని ఖాజా అనే వ్యక్తి చేపట్టాడు. అంజయ్య నగర్‌లో అత్యంత ప్రమాదకర స్థాయిలో భవనాల నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖాజా నిర్మిస్తున్న అక్రమ భవనంపై పలుమార్లు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఫిర్యాదు చేశారు. అయిన హైడ్రా, సీఎంసీ సిబ్బంది పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే అంజయ్య నగర్‌లో ఐదు అంతస్తుల భవనం పక్కకు ఒరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్వర్ణగిరి క్షేత్రంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు

పవర్ -- వరంగల్

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, వారి సతీమణి శ్రీమతి నాయిని నీలిమ రెడ్డి తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.





**మనవరాలి పేరిట తులాభారం -- మొక్కుల సమర్పణ:**

అనంతరం ఆలయంలో స్వామివారికి వారు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దర్శనానంతరం తమ మనవరాలు చిరంజీవి ఆయు శిరిదార పేరిట ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయబద్ధంగా తులాభారం నిర్వహించి, స్వామివారికి తమ మొక్కులను తీర్చుకున్నారు. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని ఈ సందర్భంగా వారు ప్రార్థించారు.

**వేదాశీర్వచనం:**

పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ముఖమండపంలో అర్చకస్వాములు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులకు వేదాశీర్వచనం పలికి, స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**- ఇర్సడ్ల వంశీకృష్ణ, రిపోర్టర్, పవర్ దినపత్రిక.**

# రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిరంతర నిఘా ఉంచాలి

**- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత**

**- నేరం జరిగిన తర్వాత దర్యాప్తు కంటే ముందస్తు చర్యలతో నిరోధించడమే ముఖ్యం**

**- డ్రగ్స్ విక్రయాలు, సరఫరాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశం**

**- సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని పిలుపు**




పవర్ -- వరంగల్

నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేయడం కంటే ముందస్తు చర్యలతో నేరాలను అడ్డుకోవడమే అత్యంత కీలకమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం, విక్రయాలు, సరఫరా మార్గాలపై పక్కా సమాచారం సేకరించి కట్టడి చేయాలని ఆదేశించారు. యువతకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత, వృద్ధులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనుమానాస్పద ఫోన్‌కాల్స్, లింకులు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ప్రచారం చేయాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సకాలంలో న్యాయం అందించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్‌కుమార్, దారా కవిత, రాజమహేంద్ర నాయక్, కిషన్‌సింగ్, అదనపు డీసీపీలు సురేష్‌కుమార్, బాలస్వామి, ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

**- ఇర్సడ్ల వంశీకృష్ణ, రిపోర్టర్, పవర్ దినపత్రిక.**

# బాధ్యతలు స్వీకరించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నూతన కార్యదర్శి కె.పూజ

**- ఉచిత న్యాయ సాయం, లోక్‌అదాలత్‌ల నిర్వహణే ప్రాధాన్యం**

పవర్ - వరంగల్

వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (DLSA) కార్యదర్శిగా న్యాయమూర్తి కె.పూజ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతిపై ఇంతకుముందు వరంగల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన ఆమెను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇన్‌చార్జి కార్యదర్శి ఎ.ప్రదీప్, సూపరింటెండెంట్ మోహన్‌రావు మరియు సిబ్బంది కె.పూజకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో న్యాయ సేవలపై అవగాహన పెంచడం తన ప్రధాన ప్రాధాన్యతలని తెలిపారు. లోక్‌అదాలత్‌లు, న్యాయ అవగాహన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. న్యాయ సేవా కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలకు చేరువ చేయాలని, ఇందుకు అధికారులు, సిబ్బంది, ప్యానెల్ న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**- ఇర్సడ్ల వంశీకృష్ణ, డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, పవర్ దినపత్రిక.**





# ఏనుగు వెళ్తుంటే కుక్కలు మొరుగుతూనే ఉంటాయి: విమర్శలపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ధ్వజం

పవర్ -- గీసుగొండ

"ఏనుగు వెళ్తుంటే కుక్కలు మొరుగుతూనే ఉంటాయి.. నా వయసుపై విమర్శలు చేస్తున్న వారికి నా పనితనమే సమాధానం" అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. విమర్శలకు ప్రతి విమర్శ చేసి సమయం వృథా చేసుకోనని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికే కృషి చేస్తున్నానని తెలిపారు. శనివారం గీసుగొండ మండలంలోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో గీసుగొండ, సంగెం మండలాలతో పాటు గ్రేటర్ వరంగల్ 15, 16, 17వ డివిజన్ల లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రేవూరి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇటీవల పరకాలలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మళ్లీ తనకే ఎమ్మెల్యే టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించడం తాను అసలు ఊహించలేదని తెలిపారు. ఆ సమావేశానికి భారీగా తరలివచ్చిన ప్రజల స్పందన, అభిమానాన్ని చూసిన తర్వాతే సీఎం ఆ నిర్ణయం ప్రకటించారని, ప్రజల ఆశీర్వాదమే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

- ఇర్సడ్ల వంశీకృష్ణ, రిపోర్టర్, పవర్ దినపత్రిక.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, బూట్ల పంపిణీ

**-- విద్యాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



పవర్ - భూపాలపల్లి

రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని భూపాలపల్లి శాసనసభ్యులు శ్రీ గండ్ర సత్యనారాయణ రావు (జిఎస్ఆర్) అన్నారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, బూట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జిఎస్ఆర్ విద్యార్థులకు స్వయంగా వీటిని అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తూ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువు కొనసాగించేందుకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు, బ్యాగులు, పుస్తకాలు, బూట్లు వంటి వస్తువులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, విద్యార్థుల భవిష్యత్తు బాగుంటే రాష్ట్ర భవిష్యత్తు కూడా బాగుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**- ఇర్సడ్ల వంశీకృష్ణ రిపోర్టర్, పవర్ దినపత్రిక.**







# రూ.530 కోట్లతో నగరంలో శాశ్వత నీటి సమస్యకు పరిష్కారం

**– త్వరలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

పవర్ – హనుమకొండ

వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి పనులతోనే ప్రజల ముందుకు వెళ్తామని, చేసిన పనులను చూపించి ఓటు అడుగుతామని ఆయన పేర్కొన్నారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 49వ డివిజన్ లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీలలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించే లక్ష్యంతో శనివారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిడబ్ల్యూఎంసి (+ఔవీజ) కమిషనర్ వెంకన్నతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో ఒక్కో డివిజన్‌కు రూ.50 లక్షలు కేటాయించడం గొప్పగా చెప్పుకునేవారని, కానీ ప్రస్తుతం తమ ప్రభుత్వం ఒక్కో డివిజన్‌కు రూ.10 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. శాయంపేట ప్రాంతానికే రూ.20 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. నగరంలో రూ.530 కోట్లతో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కార పనులకు శ్రీకారం చుట్టామని, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్‌తో పాటు పాత నీటి నిల్వ వ్యవస్థల ఆధునీకరణ పనులు వేగవంతం చేశామని వెల్లడించారు.అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నగరానికి భారీ వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు మంజూరైందని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ నడుస్తోందని తెలిపారు. డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్లు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థలతో సమగ్రంగా రూపుదిద్దుకోనున్న ఈ ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల దృష్ట్యా తవ్వకాలు జరపాల్సి వస్తుంది కాబట్టి, ప్రజల నిధులు వృథా కాకుండా పనులు పూర్తయ్యాకే అత్యాధునిక రోడ్లు వేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

జిడబ్ల్యూఎంసి కమిషనర్ వెంకత్ మాట్లాడుతూ... కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటడం అభినందనీయమని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**– ఇర్సడ్ల వంశీకృష్ణ**
**రిపోర్టర్, పవర్ దినపత్రిక.**

# తెలంగాణలో నేటి అర్ధరాత్రి నుంచి ఆటోలు, క్యాబ్‌ల నిరవధిక బంద్

ఉచిత బస్సు పథకంతో జీవనోపాధి దెబ్బతిన్నదని డ్రైవర్ల ఆవేదన తెలంగాణ రాష్ట్రంలో ఆదివారం (23వ తేదీ) అర్ధరాత్రి నుంచి ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్‌ల సేవలు నిరవధికంగా నిలిచిపోనున్నాయి. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోవడం లేదని, ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఆటో, యాప్ ఆధారిత సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఈ బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రోజువారీ ప్రయాణాలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని జేఏసీ నాయకులు ఆరోపించారు. ప్రధానంగా ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఏడాదికి రూ.12,000 ఆర్థిక సాయం (ఎరియర్స్ సహా) అందిస్తామన్న హామీ ఇప్పటికీ అమలు కాలేదని వారు గుర్తుచేశారు.

# కాంగ్రెస్ సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే బిఆర్ఎస్ అబద్ధపు ప్రచారాలు

## మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పవర్ – స్టేషన్ ఘన్‌పూర్



దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులు, ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో అమలు చేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో, ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వేలేరు, ధర్మసాగర్ మండలాలకు సంబంధించిన కొత్త డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. కోటి 06 లక్షల రేషన్ కార్డుల ద్వారా 3 కోట్ల 10 లక్షల మందికి ఉచిత సన్న బియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి పేద ప్రజల పట్ల నిజమైన ప్రేమ ఉంటే దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ చేయాలని సవాల్ విసిరారు. బడా వ్యాపారవేత్తలకు వేల కోట్ల రుణాలు మాఫీ చేసే ప్రభుత్వం కాకుండా, పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెడుతున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ?కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చూసి తట్టుకోలేక బిఆర్ఎస్ నాయకులు దుర్మార్గంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రెండు రోజుల క్రితం ఆదిలాబాద్‌లో సంజీవ రెడ్డి అనే వ్యక్తికి, ఇతర కాంగ్రెస్ నాయకులకు గొడవ జరిగితే.. దాన్ని తనపై జరిగినట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం బిఆర్ఎస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. కొన్ని యూట్యూబ్ ఛానళ్లను కొనుగోలు చేసి, నెల జీతాలు ఇస్తూ ప్రభుత్వంపై విష ప్రచారం చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన 35 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ రూపాయి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. గ్రామంలోనైనా, నియోజకవర్గంలోనైనా అభివృద్ధి జరగాలంటే ప్రజల కోసం నిజాయితీగా పనిచేసే వారిని ఎన్నుకోవాలని ఆయన సూచించారు.

**– ఇర్సడ్ల వంశీకృష్ణ**
**రిపోర్టర్ పవర్ దినపత్రిక.**

# బీఎల్‌ఏలతో సమన్వయంతో ప్రతి ఓటును పకడ్బందీగా పరిశీలించాలి






## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి SIR ఫేజ్-2పై కాంగ్రెస్ శ్రేణులకు కీలక అవగాహన, శిక్షణ కార్యక్రమం

పవర్ -- హనుమకొండ

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) రెండో దశ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఎలాంటి నష్టం జరగకుండా పకడ్బందీగా పనిచేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.హనుమకొండ డీసీసీ భవన్‌లో శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్లు (BLAలు), కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జీలు, ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు మరియు కాంగ్రెస్ కార్యకర్తలకు SIR ఫేజ్-2 పై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ, SIR ఇన్‌చార్జీలు నాజిర్ అహ్మద్, పల్లి శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు నాయిని వెంకట్రామ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్తె డాక్టర్ శ్రీగోధర్ రెడ్డి ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా SIR రెండో దశ ప్రక్రియ, ఓటర్ల వివరాల నిశిత పరిశీలన, బూత్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలంకషంగా అవగాహన కల్పించారు.అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జీలు, ముఖ్య నాయకులందరూ బీఎల్‌ఏలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ బూత్ స్థాయి వరకు వెళ్లి పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ఏమరుపాటు లేదా నిర్లక్ష్యం వహించకూడదని, అర్హత కలిగిన ప్రతి ఓటునూ కాపాడుకోవాల్సిన బాధ్యత శ్రేణులపై ఉందన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, బూత్ వారీగా పురోగతిని నిరంతరం సమీక్షించాలని ఆయన ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జీలు, సీనియర్ నాయకులు, బీఎల్‌ఏ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఇర్సడ్ల వంశీకృష్ణ, రిపోర్టర్, పవర్ దినపత్రిక.**

# వరంగల్ వెస్ట్ (GWMC) 26 డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాన్ని ఆమోదించిన టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ --

**ఉత్తర్వులు జారీ చేసిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

పవర్ -- హనుమకొండ

వరంగల్ వెస్ట్ నియోజకవర్గ పరిధిలోని జీడబ్ల్యూఎంసీ (+ఔవీజ) 26 నూతన డివిజన్ల అధ్యక్షుల నియామక ప్రతిపాదనలకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శనివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతనంగా ఎంపికైన డివిజన్ అధ్యక్షులు అంకితభావంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి, క్షేత్రస్థాయి నుంచి సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడానికి కృషి చేయాలని పార్టీ నాయకత్వం ఆకాంక్షించింది. పదవులు పొందిన నాయకులకు డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

**నియమితులైన డివిజన్ అధ్యక్షుల వివరాలు:**

డివిజన్ 4 అధ్యక్షుడిగా బాషబోయిన శ్రీధర్ యాదవ్, డివిజన్ 5కు సోమ కరుణ శ్రీ, డివిజన్ 6కు మహమ్మద్ ఆజం, డివిజన్ 7కు పోలు లక్ష్మీనారాయణ, డివిజన్ 8కి సీతా శ్యామ్, డివిజన్ 9కి భీమా వినయ్, డివిజన్ 10కి మహమ్మద్ ఫిరోజ్ ఖాన్, డివిజన్ 11కు ఎండీ సమద్, డివిజన్ 29కి బొమ్మ సురేష్, డివిజన్ 30కి రాజ్ కుమార్, డివిజన్ 31కి సత్తు రమేష్, డివిజన్ 47కు దొంగల కుమార్, డివిజన్ 48కి చందు, డివిజన్ 49కి నాగపురి కరణ్, డివిజన్ 50కి బషీర్, డివిజన్ 51కి కరీం, డివిజన్ 52కి తడుక సుమన్, డివిజన్ 53కి ఎర్ర మహేందర్, డివిజన్ 54కి సుమన్, డివిజన్ 57కు అశోక్ రెడ్డి, డివిజన్ 58కి తాళ్లపెల్లి సుధాకర్, డివిజన్ 59కి దీపక్ రెడ్డి, డివిజన్ 60కి బుస్స నవీన్, డివిజన్ 61కి అర్కవత్ లక్ష్మణ్ నాయక్, డివిజన్ 62కి పాలడుగుల ఆంజనేయులు, డివిజన్ 63 అధ్యక్షురాలిగా విజయశ్రీ రజాలి నియమితులయ్యారు.

**– ఇర్సడ్ల వంశీకృష్ణ**
**రిపోర్టర్, పవర్ దినపత్రిక.**